ఫైనల్లో సాత్విక్ జోడి ఓటమి

షెన్‌జెన్ : చైనా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత పురుషుల జోడి సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి తుది మెట్టుపై బోల్తా పడ్డారు. టైటిల్ పోరులో సాత్విక్-చిరాగ్ 71 నిమిషాలలో చైనాకు చెందిన ప్రపంచ నంబర్1 జోడి లియాంగ్ వీ కెంగ్-వాంగ్ చాంగ్ చేతిలో 19-21, 21-18, 19-21 స్కోరుతో ఓడిపోయారు. ఆద్యంతం విజయం దోబూచులాడిన పోరులో ఇరు జట్లు హోరాహోరీగా పోరాడాయి. తొలి గేమ్‌ను కోల్పోయిన భారత జంట రెండో గేమ్‌ను మూడు పాయింట్ల తేడాతో గెలుచుకుని పోరులో నిలిచింది. ఇక నిర్ణయాత్మక మూడో గేమ్ కూడా నువ్వా నేనా అన్నట్టు సాగింది. 1-8తో వెనుకంజలో ఉన్న భారత జోడి తరువాత అంతరాన్ని తగ్గించింది. ఆపై 13-20తో వెనుబాటులో ఉన్న సాత్విక్-చిరాగ్ ఆరు చాంపియన్‌షిప్ పాయింట్లను కాచుకుని స్కోరును 19-20కి చేర్చారు. ఈ దశలో చైనా జోడి తమ అనుభవాన్నంతా రంగరించి గేమ్‌తోపాటు టైటిల్‌ను దక్కించుకున్నారు. గత ఎనిమిదేళ్లలో ఈ టోర్నీలో చైనాకు దక్కిన తొలి టైటిల్ ఇది. ఈ విజయంతో ఆసియన్ క్రీడల్లో భారత జోడి చేతిలో పరాజయానికి చైనా జంట ప్రతీకారం తీర్చుకున్నట్టయింది.

ముంబైకి హార్దిక్ పాండ్యా!

న్యూఢిల్లీ : గుజరాత్ టైటాన్స్ కెప్టెన్, టీమ్‌ఇండియా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా ఐపీఎల్‌లో వచ్చే సీజన్‌కు ముంబై ఇండియన్స్ జట్టును చేరనున్నాడు. గుజరాత్ టైటాన్స్ రిటైన్డ్ ఆటగాళ్ల జాబితాలో అతని పేరు ఉన్నప్పటికీ డిసెంబర్ 12వరకు ట్రేడింగ్ జరుగనుండడంతో హార్దిక్ ముంబైకి మారనున్నాడన్న వదంతులకు బలం చేకూరుతోంది. కాగా మినీ వేలం డిసెంబర్ 19న దుబాయ్‌లో జరుగనున్నది. 2015లో ముంబై ఇండియన్స్‌తో ఐపీఎల్ కెరీర్ ఆరంభించిన హార్దిక్ నాలుగుసార్లు టైటిల్ సాధనలో పాలుపంచుకున్నాడు. అనంతరం 2022లో గుజరాత్ టైటాన్స్‌కు మారి ఆ జట్టు కెప్టెన్‌గా టైటిల్ సాధించిపెట్టాడు. గత యేడాది గుజరాత్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. వేలం ముగిసేసరికి హార్దిక్ గుజరాత్‌తోనే ఉంటాడా.. లేక ముంబైకి మారుతాడా అన్నది వేచిచూడాలి.

వెర్‌స్టాపెన్‌కు 19వ టైటిల్

అబుదాబి : ఫార్ములావన్ దిగ్గజ డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్ ఈ సీజన్‌లో రికార్డు స్థాయిలో 19వ టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. ఆదివారం జరిగిన అబుదాబి గ్రాండ్‌ప్రి రేస్‌ను వెర్‌స్టాపెన్ గెలుచుకున్నాడు. ఓవరాల్‌గా అతనికిది 54వ టైటిల్ కాగా, అత్యధిక టైటిల్స్ సాధించినవారిలో సెబాస్టియన్ వెట్టెల్‌ను అధిగమించి మూడో స్థానానికి చేరుకున్నాడు. లూయిస్ హామిల్టన్(103), మైకేల్ షుమాకర్(91) అతనికంటె ముందున్నారు.

టాప్-3 బ్యాటర్లు హాఫ్‌సెంచరీలతో రెచ్చిపోవడంతో ఆస్ట్రేలియాపై వరుసగా రెండో టీ20లో టీమ్‌ఇండియా విజయం సాధించింది. వన్డే ప్రపంచకప్ ఫైనల్ పరాజయాన్ని పక్కనపెట్టి యువ ఆటగాళ్లతో బరిలోకి దిగిన భారత జట్టు అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్‌లో దుమ్మురేపింది. యశస్వి జైస్వాల్ ఇచ్చిన మెరుపు ఆరంభాన్ని రుతురాజ్, ఇషాన్ కొనసాగించగా.. ఆఖర్లో రింకూసింగ్ పిడుగుల్లాంటి షాట్లతో కంగారూలపై విరుచుకుపడ్డాడు. గత మ్యాచ్‌లో భారీగా పరుగులు సమర్పించుకున్న బౌలర్లు.. ఈ సారి మెరుగైన ప్రదర్శన కనబర్చడంతో టీమ్‌ఇండియా సిరీస్‌లో 2-0తో ముందంజ వేసింది.

యంగ్ విన్

రెండో టీ20లో భారత్ జయభేరి

44 పరుగులతో ఆస్ట్రేలియా చిత్తు

మెరిసిన యశస్వి, ఇషాన్, రవి

తిరువనంతపురం: వచ్చే ఏడాది జరగనున్న టీ20 ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకొని భారత టీమ్ మేనేజ్‌మెంట్ యువ ఆటగాళ్లకు విరివిగా అవకాశాలు ఇస్తుండగా.. వాళ్లు వాటిని రెండు చేతులతో ఒడిసి పట్టుకుంటున్నారు. వన్డే వరల్డ్‌కప్ ఫైనల్లో ఆస్ట్రేలియా చేతిలో పరాజయం పాలైన టీమ్‌ఇండియా.. ఆ ఓటమి నుంచి తేరుకొని టీ20 సిరీస్‌లో దుమ్మురేపుతున్నది. విశాఖపట్నంలో జరిగిన తొలి పోరులో రికార్డు లక్ష్యాన్ని ఛేదించిన భారత్.. ఆదివారం తిరువనంతపురంలో జరిగిన రెండో టీ20లో 44 పరుగుల తేడాతో జయకేతనం ఎగరవేసింది. తద్వారా ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 2-0తో ఆధిక్యంలో నిలిచింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 235 పరుగులు చేసింది. మ్యాచ్‌కు వర్షం అంతరాయం కలిగిస్తుందేమో అని భావిస్తే.. మన టాపార్డర్ మైదానంలో పరుగుల సునామీ సృష్టించింది. యశస్వి జైస్వాల్ (25 బంతుల్లో 53; 9 ఫోర్లు, 2 సిక్సర్లు), రుతురాజ్ గైక్వాడ్ (43 బంతుల్లో 58; 3 ఫోర్లు, 2 సిక్సర్లు), ఇషాన్ కిషన్ (32 బంతుల్లో 52; 3 ఫోర్లు, 4 సిక్సర్లు) అర్ధశతకాలతో ఆకట్టుకోగా.. కెప్టెన్ సూర్యకుమార్ (19; 2 సిక్సర్లు), రింకూ సింగ్ (9 బంతుల్లో 31 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్సర్లు) ఆఖర్లో భారీ షాట్లతో చెలరేగిపోయారు. ముఖ్యంగా నయా ఫినిషర్‌గా గుర్తింపు తెచ్చుకుంటున్న రింకూ సింగ్ భారీ షాట్లతో శివ తాండవ ఆకట్టుకున్నాడు. ఆస్ట్రేలియా బౌలర్లలో మాడాడు. ఎలీస్ 3 వికెట్లు పడగొట్టాడు. అనంతరం లక్ష్య ఛేదనలో ఆస్ట్రేలియా 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 191 పరుగులు చేసింది. మార్కస్ స్టొయినిస్ (45) టాప్ స్కోరర్ కాగా.. మిగిలిన వాళ్లు విఫలమయ్యారు. గత మ్యాచ్ సెంచరీ హీరో ఎలీస్ 2 పరుగులకే పెవిలియన్ చేరగా.. తెలంగాణ కుర్రాడు తిలక్ వర్మ (2 బంతుల్లో 7 నాటౌట్) ఓ సిక్సర్‌తో ఎక్కువ సేపు నిలువలేకపోయారు. టిమ్ డేవిడ్ (37), కెప్టెన్ మాథ్యూ వేడ్ (42 నాటౌట్) పోరాటం ఓటమి అంతరాన్ని తగ్గించేందుకే పరిమితమైంది. భారత బౌలర్లలో రవి, ప్రసిద్ధ్ చెరో 3 వికెట్లు పడగొట్టాడు. యశస్వికి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ దక్కింది. ఇరు జట్ల మధ్య మంగళవారం గువాహటిలో మూడో టీ20 జరగనుంది.

టర్నింగ్ పాయింట్!

భారత ఇన్నింగ్స్‌కు యశస్వి మెరుపు ఆరంభాన్నిస్తే.. రింకూ తనదైన శైలిలో ఫినిషింగ్ టచ్ ఇచ్చాడు. అబాట్ వేసిన ఇన్నింగ్స్ నాలుగో ఓవర్‌లో యశస్వి వరుసగా 4,4,4,6,6తో 24 పరుగులు పిండుకుంటే.. అదే అబాట్ వేసిన ఇన్నింగ్స్ 19వ ఓవర్‌లో రింకూ సింగ్ 4,6,4,4,6తో 25 పరుగులు రాబట్టాడు.

సంక్షిప్త స్కోర్లు

భారత్: 235/4 (రుతురాజ్ 58, యశస్వి 53; ఎలీస్ 3/45),
ఆస్ట్రేలియా: 20 ఓవర్లలో 191/9 (స్టొయినిస్ 45, వేడ్ 42 నాటౌట్; రవి 3/32, ప్రసిద్ధ్ 3/41).

రష్మికకు టైటిల్

బెంగళూరు: హైదరాబాద్‌కు చెందిన రష్మిక శ్రీవల్లి తొలి ఐటీఎఫ్ టైటిల్‌ను సాధించింది. ఆదివారం జరిగిన ఫైనల్లో రష్మిక 6-0, 4-6, 6-3తో జీల్ దేశాయ్‌ను ఓడించి విజేతగా నిలిచింది. ఈ విజయంతో రష్మికకు 3935 డాలర్ల(రూ.3.27 లక్షలు)తోపాటు 50 డబ్ల్యుటీఏ పాయింట్లు దక్కాయి. రెండో గేమ్‌లో బ్రేక్ సాధించిన రష్మిక ఒక్క గేమ్‌ను కూడా వదులుకోకుండా తొలి సెట్‌ను దక్కించుకుంది. రెండో సెట్‌లో తొలి గేమ్‌ను కోల్పోయిన రష్మిక వరుసగా నాలుగు, అయిదు గేమ్‌లను గెలుచుకుని 3-2 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. అయితే జీల్ వరుసగా మూడు గేమ్‌లు గెలుచుకుని 5-3 ఆధిక్యం సాధించి అనంతరం సెట్‌నుకూడా దక్కించుకుంది. ఇక నిర్ణయాత్మక మూడో సెట్‌లో ఆరంభంలోనే 3-0 ఆధిక్యం సాధించిన రష్మిక దానిని నిలబెట్టుకుంటూ6-3తో సెట్‌ను, మ్యాచ్‌ను, టైటిల్‌ను సొంతం చేసుకుంది.

తరనుమ్ తీన్‌మార్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: పవర్ లిఫ్టింగ్ ఓపెన్ ప్రపంచకప్‌లో తెలంగాణకు చెందిన అర్షియా తరనుమ్ మూడు స్వర్ణాలతో మెరిసింది. కిర్గిస్థాన్ వేదికగా జరిగిన టోర్నీలో మాస్టర్స్-1 (40 సంవత్సరాలు) విభాగంలో బరిలోకి దిగిన తరనుమ్ అద్వితీయ ప్రదర్శన కనబర్చింది. మహిళల 60 కేజీల ఈవెంట్‌లో ఫుల్ పవర్ లిఫ్టింగ్‌లో 232.5 కేజీల బరువెత్తి అగ్రస్థానంలో నిలిచిన తరనుమ్.. బెంచ్, డెడ్‌లిఫ్ట్‌లోనూ దుమ్మురేపి పసిడి పతకాలు కైవసం చేసుకుంది.

అంతర్-జాతీయం

వీసా లేకుండా మలేషియా వెళ్లొచ్చు

డిసెంబర్ 1 నుంచి అమలు

న్యూఢిల్లీ, నవంబర్ 26: భారతీయులకు మలేషియా ప్రభుత్వం శుభవార్త చెప్పింది. భారతీయులు ఇకపై వీసా లేకుండానే ఆ దేశానికి వెళ్లొచ్చు. డిసెంబర్ 1వ తేదీ నుంచి ఇది అమల్లోకి వస్తుందని, వీసా లేకుండా 30 రోజుల పాటు తమ దేశంలో ఉండొచ్చని మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం ఆదివారం వెల్లడించారు. ఈ అవకాశాన్ని భారతీయులతో పాటు చైనా దేశస్తులకు కూడా కల్పిస్తున్నామని పేర్కొన్నారు. పర్యాటక రంగాన్ని ప్రోత్సహించేందుకు మలేషియా ప్రభుత్వం చర్యలు తీసుకొంటున్నది.

మార్చిలో సీఏఏ తుది ముసాయిదా!

కోల్‌కతా : పౌరసత్వ (సవరణ) చట్టం (సీఏఏ) తుది ముసాయిదా వచ్చే ఏడాది మార్చి 30 నాటికి సిద్ధమవుతుందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి అజయ్ మిశ్రా తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మతపరమైన హింసకు గురై బంగ్లాదేశ్ నుంచి పారిపోయి వచ్చిన మటువా కులస్తుల పౌరసత్వ హక్కును ఎవరూ లాక్కోలేరని నొక్కి చెప్పారు. సీఏఏ రూపకల్పనకు సంబంధించి ఎదురవుతున్న కొన్ని సమస్యలను పరిష్కరించాల్సి ఉందన్నారు.

సౌర తుఫాను భూమిని తాకే అవకాశం

న్యూఢిల్లీ : సూర్యునిపై మండుతున్న విస్ఫోటనాల మధ్య సౌర తుఫాను భూమిని తాకే అవకాశం ఉందని నాసా హెచ్చరించింది. సూర్యుని కార్యకలాపాలలో ఇటీవల ఆకస్మాత్తుగా పెరుగుదల కన్పిస్తున్నది. సూర్య రశ్మి తీవ్రత పెరగడమే కాక, అవి వేడి ప్లాస్మా ప్లూమ్‌లను అంతరిక్షంలోకి వెదజల్లుతున్నది. నవంబర్ 25లోగా మన ఆయస్కాంత క్షేత్రాన్ని, వాతావరణాన్ని తాకుతుందని నాసాను ఉటంకిస్తూ న్యూస్ వీక్ నివేదించింది. విద్యుత్ అయస్కాంత ప్రభావంతో సూర్యుని సౌర మంటలు కూడా రావొచ్చునని నాసా హెచ్చరించింది.

ఉద్యోగాలా.. చూద్దాంలే!

- 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలపై కర్ణాటక కాంగ్రెస్ యూటర్న్
- 100 రోజుల్లో 2 లక్షల కొలువులంటూ మ్యానిఫెస్టోలో హామీ
- ఆరు నెలలైనా నోటిఫికేషన్లు ఇవ్వకపోవడంపై మీడియా ప్రశ్న
- ఇప్పుడు కాదు.. ఐదేండ్లలో చూస్తామన్న సీఎం సిద్ధరామయ్య
- కర్ణాటకలో మాటతప్పిన అదే కాంగ్రెస్ ఇప్పుడు తెలంగాణలో ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలు అంటూ మోసపూరిత వాగ్దానం
- నమ్మితే, నిరుద్యోగులుగా మిగలడం ఖాయమంటున్న మేధావులు
- పదేండ్లలో కాంగ్రెస్ తెలంగాణలో ఇచ్చిన ఉద్యోగాలు 10,116
- బీఆర్ఎస్ హయాంలో భర్తీచేసిన ప్రభుత్వ ఉద్యోగాలు 1,60,083

కాంగ్రెస్ అంటే మోసం..
కాంగ్రెస్ అంటే నయవంచన...
కాంగ్రెస్ అంటే ఇచ్చిన మాట తప్పడం....
చరిత్ర నెమరేసినా.. వర్తమానాన్ని తలుచుకొన్నా.. భవిష్యత్తులోకి తొంగి చూసినా.. వాస్తవం ఇదే!

ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ విషయంలో కాంగ్రెస్ చిత్తశుద్ధి ఏమిటో మరోసారి రుజువైంది.
ఐదు గ్యారెంటీలతో కర్ణాటక ప్రజలకు ధోకా ఇచ్చిన హస్తంపార్టీ..
2 లక్షల సర్కారీ కొలువుల భర్తీపై కూడా యూటర్న్ తీసుకొంది.
అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను నింపుతామన్న కర్ణాటక కాంగ్రెస్ మాటమార్చింది.
'ఉద్యోగాలు ఇప్పుడు ఇవ్వలేం. ఐదేండ్లు ఉందిగా చూద్దాంలే!' అంటూ ఆ రాష్ట్ర సీఎం సిద్ధరామయ్య చేసిన వ్యాఖ్యలే దీనికి నిదర్శనం.
ఇప్పుడు, అదే కాంగ్రెస్ తెలంగాణలో తొలి ఏడాదిలో 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామంటూ మాయమాటలు చెప్తున్నది.
ఈ మాటలు నమ్మామో.. కర్ణాటక నిరుద్యోగుల్లాగే మన బిడ్డలూ ఆగమవుతారు. జాగ్రత్త!!

ఆదివారం హైదరాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతున్న కర్ణాటక సీఎం సిద్ధరామయ్య

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, నవంబర్ 26 (నమస్తే తెలంగాణ): ఐదు గ్యారంటీలతో కర్ణాటక ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆ హామీలను అటకెక్కించింది. ఇప్పుడు ప్రభుత్వ ఉద్యోగాల భర్తీని కూడా పక్కనబెట్టింది. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ప్రభుత్వ విభాగాల్లో ఖాళీగా ఉన్న 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామంటూ గత మేలో కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ కర్ణాటక ఎన్నికల ప్రచారంలో ఆర్భాటంగా ప్రకటించారు. ఇదే అంశాన్ని మ్యానిఫెస్టోలో పొందుపరిచారు. కాంగ్రెస్ మాటలు నమ్మిన లక్షలాదిమంది నిరుద్యోగులు తమ బతుకులు బాగుపడుతాయన్న ఆశతో ఆ పార్టీకి ఓటేశారు. అయితే, అధికారంలోకి వచ్చి ఆరు నెలలైనప్పటికీ, ఒక్క నోటిఫికేషన్ కూడా విడుదల కాలేదు. ఇదే విషయమై తెలంగాణ ఎన్నికల ప్రచారానికి వచ్చిన సీఎం సిద్ధరామయ్యను ఆదివారం హైదరాబాద్‌లో మీడియా ప్రశ్నించింది. 'కర్ణాటకలో అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. అయితే, ఆరు నెలలు గడిచినప్పటికీ, ఆ హామీని నెరవేర్చలేదు' అని ఓ విలేకరి సిద్ధరామయ్యను ప్రశ్నించారు. దీనిపై సీఎం స్పందిస్తూ.. 'తొలి దశలో మేము 5 గ్యారంటీలను నెరవేర్చాం. అలాగే 76 హామీలను కూడా పూర్తి చేశాం. మ్యానిఫెస్టోలోని అన్ని హామీలను ఒకేసారి నెరవేర్చలేం. మ్యానిఫెస్టో అంటేనే ఐదేండ్లు' అని చెబుతూ.. ఉద్యోగాల భర్తీపై అప్పట్లోపు చూస్తామన్నట్టు బదులిచ్చారు. ఉద్యోగాల భర్తీపై మాట తప్పిన కాంగ్రెస్ ప్రభుత్వంపై కర్ణాటక నిరుద్యోగులు మండిపడుతున్నారు. ఇస్తామన్న నిరుద్యోగ భృతిని కూడా సర్కారు ఇవ్వట్లేదని వాపోతున్నారు.

తెలంగాణలో మాయమాటలు

కర్ణాటక నిరుద్యోగులను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు తెలంగాణ ప్రజలను కూడా మభ్యపెట్టడానికి ప్రయత్నిస్తున్నది. తొలి ఏడాదిలో 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామంటూ ప్రకటించడమే కాదు.. జాబ్ క్యాలెండర్‌ను కూడా మ్యానిఫెస్టోలో విడుదల చేసింది. దీనిపై తెలంగాణ మేధావులు మండిపడుతున్నారు. 'కర్ణాటకలో చేయలేనిది ఇక్కడ ఎలా చేస్తారని?' నిలదీస్తున్నారు. రాజ్యాంగబద్ధమైన టీఎస్‌పీఎస్సీ, ఇతర నియామక ఏజెన్సీలు ప్రకటించాల్సిన జాబ్ క్యాలెండర్‌ను ఒక పార్టీ ప్రకటించడం ఏమిటని? ప్రశ్నిస్తున్నారు. 2004-14 మధ్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ భర్తీ చేసిన ఉద్యోగాలు 24,086 కాగా, అందులో తెలంగాణ పది జిల్లాల వాటా 42 శాతం అనుకుంటే.. దక్కినవి కేవలం 10,116 ఉద్యోగాలే. కాంగ్రెస్‌కు అంత చిత్తశుద్ధి ఉంటే 10 వేల ప్రభుత్వ ఉద్యోగాలను మాత్రమే ఎందుకు భర్తీ చేసిందని మేధావులు అడుగుతున్నారు.

కాంగ్రెస్ కంటే 16 రెట్లు ఎక్కువ

ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ హయాంలో గడిచిన పదేండ్లలో (2014-23) 2,32,308 ఉద్యోగాలకు ఆర్థికశాఖ అనుమతి ఇచ్చింది. అందులో నియామక సంస్థలు 27 శాఖల్లో 2,02,735 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు ఇచ్చాయి. ఇప్పటివరకూ 1,60,083 ఉద్యోగాల భర్తీ ప్రక్రియ పూర్తయింది. మరో 42,652 ఉద్యోగాల భర్తీ ప్రక్రియ కొనసాగుతున్నది. ఎన్నికల నోటిఫికేషన్ రాకుంటే.. అవికూడా ఇప్పటికే పూర్తియిపోయేవి. ఈ లెక్కన తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పటితో పోలిస్తే బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సుమారు 16 రెట్లు ఎక్కువ ఉద్యోగాల భర్తీ జరిగింది. కాంగ్రెస్ పాలనలో ఏడాదికి సగటున 1,012 ఉద్యోగాలు భర్తీ జరిగితే.. బీఆర్ఎస్ పాలనలో 2014 తర్వాత ఏడాదికి సగటున 16,850 ఉద్యోగాలను భర్తీ జరిగింది.

పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ఇలా

ఆర్థికశాఖ అనుమతి ఇచ్చినవి
2,32,308

నోటిఫికేషన్లు ఇచ్చినవి
2,02,735

నియామక ప్రక్రియ పూర్తయినవి
1,60,083

నియామక ప్రక్రియ కొనసాగుతున్నవి
42,652

కాంగ్రెస్ అలా.. బీఆర్ఎస్ ఇలా..

పదేండ్ల పాలనలో కాంగ్రెస్ భర్తీచేసిన ఉద్యోగాలు
10,116

పదేండ్ల పాలనలో బీఆర్ఎస్ భర్తీ చేసిన ఉద్యోగాలు
1,60,083

కాంగ్రెస్ కంటే బీఆర్ఎస్ ఎక్కువగా భర్తీ చేసిన ఉద్యోగాలు
1,49,967

కాంగ్రెస్‌తో పోలిస్తే, బీఆర్ఎస్ ఉద్యోగాల భర్తీలో పెరుగుదల
1600%

కోర్టులను ఆశ్రయించేవారికి డబ్బు, భాష అడ్డంకి కారాదు

రాజ్యాంగ దినోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

సుప్రీంకోర్టు ఆవరణలో అంబేద్కర్ విగ్రహానికి నమస్కరిస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

న్యూఢిల్లీ,నవంబర్ 26: న్యాయం కోసం కోర్టులను ఆశ్రయించేవారికి డబ్బు, భాష అడ్డంకి కారాదని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. ఆల్ ఇండియా జ్యుడీషియల్ సర్వీసెస్‌ను తీసుకురావాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. ఆదివారం సుప్రీంకోర్టు ఆవరణలో అంబేద్కర్ విగ్రహాన్ని రాష్ట్రపతి ఆవిష్కరించారు. రాజ్యాంగ దినోత్సవం (నవంబర్ 26) సందర్భంగా సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. దేశంలో న్యాయ సేవలు ప్రజలందరికీ అందుబాటులోకి రావాలన్నారు. ఈ కార్యక్రమానికి సీజేఐ డీవై చంద్రచూడ్, జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, సంజీవ్ ఖన్నా, కేంద్ర న్యాయమంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ తదితరులు హాజరయ్యారు. సీజేఐ డీవై చంద్రచూడ్ మాట్లాడుతూ పౌరులు కోర్టులను ఆశ్రయించడానికి భయపడవద్దన్నారు. గత ఏడు దశాబ్దాలుగా సుప్రీంకోర్టు ప్రజాకోర్టుగా పనిచేస్తుందన్నారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా భారత రాజ్యాంగం నిరంతరం మార్పులకు లోనవుతుందని, రాజ్యాంగ విలువలపై చర్చ కేవలం కోర్టు కేసులకు పరిమితం కాదని, వివిధ రంగాల్లోనూ ప్రభావం చూపుతుందని జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ అన్నారు.

కసబ్‌ను పట్టించిన బాలికకు అందని సాయం

ముంబై, నవంబర్ 26 (నమస్తే తెలంగాణ): ముంబైలో ఉగ్రవాదులు జరిపిన ఘాతుకానికి ఆదివారంతో 15 ఏండ్లు పూర్తయ్యాయి. 26/11 దాడిగా పేర్కొనే ఆ పీడ కల భారత్‌కు చేదు జ్ఞాపకాన్ని మిగిల్చింది. ఆ దాడిలో పాల్గొన్న టెర్రరిస్టు అజ్మల్ కసబ్‌కు వ్యతిరేకంగా ధైర్యంగా సాక్ష్యం చెప్పిన దేవికకు మాత్రం ప్రభుత్వం ఇస్తానని హామీ ఇచ్చిన ఉద్యోగం, ఇండ్లు ఈ రోజు వరకు ఇవ్వక తీవ్ర అన్యాయం చేసింది. 2008 నవంబర్ 26న అప్పుడు ఆమెకు 9 సంవత్సరాలు. కసబ్ చేసిన దాడిలో ఆమె కాలిలో బుల్లెట్ దిగింది. కర్రల సాయంతో న్యాయస్థానానికి వచ్చి అతనికి వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పింది. ఆమె సాక్ష్యం వలన కసబ్‌కు ఉరిశిక్ష అమలు చేశారు.

రాజకీయాలను మార్చాలనుకొనే వారికి 'అంబేద్కర్ ఫెలోషిప్'

ఆప్ ప్రకటన.. యువత నుంచి దరఖాస్తుల ఆహ్వానం

న్యూఢిల్లీ : ఆమ్ ఆద్మీ పార్టీ సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 'అంబేద్కర్ ఫెలోషిప్ ఫర్ పొలిటికల్ చేంజ్'ను ప్రారంభిస్తున్నట్టు ఆ పార్టీ ఆదివారం ప్రకటించింది. రాజకీయాల పట్ల మక్కువ, దేశాన్ని సంస్కరించాలనే ఉత్సాహం ఉన్న యువత నుంచి దరఖాస్తులను ఆహ్వానించింది. ఎంపికైన అభ్యర్థులను క్షేత్రస్థాయి ప్రచారం, మీడియా, కమ్యూనికేషన్స్, పరిశోధన, డాటా విశ్లేషణ వంటి వాటిలో నియమిస్తారు. ఈ ఫెలోషిప్ 11 నెలలు ఉంటుందని, సీనియర్ నేతలు, నిపుణులతో పనిచేయడం ద్వారా రాజకీయ అనుభవం పొందుతారని ఆప్ తన అధికారిక ప్రకటనలో పేర్కొన్నది. వయసు 40 ఏండ్ల కంటే తక్కువ ఉన్న వారు అర్హులని తెలిపింది. దరఖాస్తుల పరిశీలన, ఇంటర్వ్యూ ఆధారంగా నియామక ప్రక్రియ ఉంటుందని తెలిపింది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.